క్లుప్తంగా

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి



ఉర్లగూడెం ఎంపీపీ పాఠశాలలో పిల్లలతో మాట్లాడుతున్న ఎంపీపీ రాంబాబు నాయక్

చింతలపూడి : ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని ఎంపీపీ డా బి.రాంబాబు నాయక్ అన్నారు. ఉర్లగూడెం ఎంపీపీ పాఠశాలను బుధవారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వం నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు బాధ్యతగా పిల్లలకు విద్యా బోధన చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

దివ్యాంగుల గుర్తింపు శిబిరం



దివ్యాంగుల నుంచి ధ్రువపత్రాలు తీసుకుంటున్న దృశ్యం

పోలవరం రూరల్ : జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో పోలవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం దివ్యాంగుల గుర్తింపు శిబిరం నిర్వహించారు. సమావేశంలో ఏవో సీహెచ్ శ్రీనివాసబాబు మాట్లాడుతూ దివ్యాంగులకు అవసరమైన పరికరాల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలియజేశారు. జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం కోఆర్డినేటర్ డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులకు పునరావాస కేంద్రం ద్వారా ఆడియాలజీ, సైకాలజీ, ఫిజియో థెరపీ, యూడీఐడీ సేవలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 39 మంది దివ్యాంగులకు అవసరమైన పరికరాలు గుర్తించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కె.నాగరాజు, ఫిజియో థెరపిస్ట్ జి.రాంబాబు, స్పెషల్ ఎడ్యుకేటర్ రష్మిత, మొబిలిటి ట్రైనర్ కంభయ్య, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు పెంపుడు కుక్కలకు రేబీస్ వ్యాధి నివారణ టీకాలు

బుట్టాయగూడెం : ప్రపంచ సంక్రమిత వ్యాధుల దినోత్సవం సందర్భంగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 9 గంటల నుంచి బుట్టాయగూడెం పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు ఉచిత రేబీస్ వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు జీలుగుమిల్లి పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ సాయి బుచ్చారావ్ బుధవారం విలేకర్లకు తెలిపారు. పెంపుడు కుక్కల యజమానులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కాలం చెల్లిన బీరు సీసాలు ధ్వంసం



బీరుసీసాలోని మద్యాన్ని పారబోస్తున్న దృశ్యం

కుక్కునూరు : కుక్కునూరు మండల కేంద్రంలోని మద్యం దుకాణంలో బుధవారం కాలంచెల్లిన బీరుసీసాలోని మద్యాన్ని ఎక్సైజ్ అధికారులు పారబోశారు. 20 కేసుల మద్యం బాటిల్‌లు కాలం చెల్లడంతో వాటిని స్వాధీనం చేసుకొని మద్యాన్ని పారబోశారు. అంతేకాక దుకాణంలోని క్వాటర్ బాటిల్ మద్యాన్ని టెస్ట్ నిర్వహించి రీడింగ్‌ను నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ శాఖ సిబ్బంది బాషా మాట్లాడుతూ, సాధారణ తనిఖీలో భాగంగా మద్యం షాపులోని మద్యాన్ని టెస్ట్ చేసినట్టు చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కాలం చెల్లిన బీరు బాటిల్‌లలోని మద్యాన్ని పారబోసినట్టు చెప్పారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

జంగారెడ్డిగూడెం రూరల్ : గురవాయిగూడెంలో వాటర్‌ప్లాంట్‌ను చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యేకి నిర్వాహకులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ రీజనల్ చైర్మన్ వందనపు సాయిబాల పద్మ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు పాల్గొన్నారు.

ఇంటింటికీ కుళాయి పథకానికి శంకుస్థాపన

బుట్టాయగూడెం : బుట్టాయగూడెంలో ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేసేందుకు సంబంధించిన పనులకు బుధవారం సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, ఎస్ఆర్ పాలెం సర్పంచ్ పొడియం సీత, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మురళీకృష్ణ మాట్లాడుతూ 350 కుళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు సుమారు రూ.10 లక్షల 65 వేలు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. కాంట్రాక్ట్ పనులు కూడా పూర్తయ్యాయని త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కొవ్వాసి నారాయణ, తెల్లం దేవరాజు, నాగేంద్ర పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష

కొయ్యలగూడెం : ప్రజా సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష చక్కని వేదిక అని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. బుధవారం బయ్యన్నగూడెం గ్రామంలో తహసీల్దార్ పాశం నాగమణి, ఎంపీడీవో ఆర్.బేబీ శ్రీలక్ష్మిల ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇప్పటికే గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ద్వారా 80శాతం సమస్యల పరిష్కార సాధనకు కృషి చేయగా నూరు శాతం ఫలితాల సాధనకు జగనన్న సురక్ష పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. సాంకేతిక సమస్యలతో పరిష్కారం కానటువంటి ప్రజల సమస్యలపై దృష్టిసారించామని, ప్రజల సమక్షంలోనే వాటిని పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. ఎన్నికల సమయానికి ప్రజల వద్దకు ధైర్యంగా వెళ్లి ఓటును అడిగే హక్కు ఒక వైఎస్సార్ సీపీకే ఉందన్నారు. ఈ సందర్భంగా అర్హత పత్రాలు పొందిన లబ్ధిదారులతో మాట్లాడిస్తున్న సమయంలో పెక్కుశాతం వ్యవసాయ భూసంబంధిత సమస్యలు పరిష్కారం అవుతున్నాయని రైతులు పేర్కొంటూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అగ్రికల్చర్ అడ్వయిజరీ బోర్డు కమిటీ జిల్లా నంబర్ పోతన తాతారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, జగనన్న సచివాలయాల మండల కో–ఆర్డినేటర్ నూకల రాము, విప్ గంటా శ్రీను, కో ఆప్షన్ సభ్యుడు షేక్ బాజీ, రైతు నాయకులు మీసాల సూర్యచంద్రం, మందపాటి రామకృష్ణ, బాలం వెంకటరామయ్య, తదితరులు పాల్గొన్నారు.



కొయ్యలగూడెం : బయ్యనగూడెంలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న పోలవరం ఎమ్మెల్యే బాలరాజు



కామవరపుకోట : కొండగూడెంలో ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా



ద్వారకాతిరుమల : రామసింగవరంలో మాట్లాడుతున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకే..

కామవరపుకోట : రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యం అని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. బుధవారం కొండగూడెం గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని అర్హులైన వారికి కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు ఇంటి వద్దకే సత్వరమే మెరుగైన సేవలందించే లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమం రూపొందించి సేవలందిస్తున్నారన్నారు. గతంలో కుల, ఆదాయ, పొలం అడంగులు, ఫ్యామిలీ సర్టిఫికెట్ల వంటి అనేక సేవలు పొందాలంటే ప్రజలు పనులు మానుకుని, డబ్బులు వృధా చేసుకుని రోజుల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగేవారని కానీ ఇప్పుడు అర్హులైన వారు దరఖాస్తు చేసుకున్న గంటల వ్యవధిలోనే ఇంటి వద్దనే పత్రాలు పొందటం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిడత రమేష్ బాబు, కామవరపుకోట సర్పంచ్ కరిపోతు అనూష, మండల సచివాలయాల కన్వీనర్ పండు ప్రసన్న, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్ట్ పండు జగదీష్, వెత్రి శీను, నల్లూరు ప్రభాకర్‌రావు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

నిమ్మలగూడెంలో జగనన్న సురక్ష

బుట్టాయగూడెం: మండలంలోని నిమ్మలగూడెం సచివాలయం వద్ద బుధవారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. సచివాలయ పరిధిలోని సుమారు 358 సర్టిఫికెట్‌లను అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం సచివాలయ సమీపంలో మొక్కలు నాటారు. జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మీ, గగ్గులోతు మోహన్‌రావు, సర్పంచ్ బన్నే బుచ్చిరాజు, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల తక్షణ పరిష్కారానికి..

చింతలపూడి : ప్రజాసమస్యల తక్షణ పరిష్కారానికి జగనన్న సురక్ష ప్రత్యేక క్యాంప్‌లు దోహదపడతాయని ఎంపీపీ డా బి.రాంబాబు నాయక్ అన్నారు. ఉర్లగూడెం గ్రామ సచివాలయం వద్ద బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో 147 మంది లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లు అందచేస్తున్నట్లు ఎంపీడీఓ మురళీకృష్ణ తెలిపారు. సర్పంచ్ కె.యువరాజు, మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలు

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని శ్రీనివాసపురం, పట్టెన్నపాలెం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీపీ కొదమ జ్యోతి, సర్పంచ్‌లు పోల్నాటి శ్రీనివాసరావు, పసుపులేటి రత్నకుమారి, ఎంపీటీసీలు జుజ్జువరపు తాతారావు, రామిశెట్టి రాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు వామిశెట్టి హరిబాబు, సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారధి, సచివాలయాల గ్రామ కన్వీనర్ పసుపులేటి నాగార్జునరావు, అధికారులు పాల్గొన్నారు.

గూటాలలో జగనన్న సురక్ష

పోలవరం రూరల్ : అర్హత ఉన్న ప్రతి ఒక్క లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అన్నారు. పోలవరం మండలం గూటాల గ్రామంలోని సచివాలయం వద్ద బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చేతులమీదుగా లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. సచివాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కలం హేమకుమారి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు బుగ్గా మురళీకృష్ణ, సర్పంచ్ ఎస్.ప్రసాద్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అందించేందుకు జగనన్న సురక్ష ఉపయోగపడుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీనురాజు అన్నారు. బండివారిగూడెంలో బుధవారం జగనన్న సురక్ష నిర్వహించారు. అర్హులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ఉచిత సేవలు

ద్వారకాతిరుమల : జగనన్న సురక్షతో ప్రజలకు ఉచిత సేవలు అందుతున్నాయని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని రామసింగవరంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే తలారి లబ్ధిదారులకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులకు నూరు శాతం సంక్షేమ ఫలాలు, అవసరమైన సర్టిఫికెట్లు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య లక్ష్యమని అన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, సచివాలయాల మండల కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉప్పల మునేశ్వరరావు, సర్పంచ్ ఆకురాతి ధానేశ్వరరావు, ఎంపీటీసీ మానికల లవరాజు, అధికారులు పాల్గొన్నారు.



బుట్టాయగూడెం : నిమ్మలగూడెంలో సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం



చింతలపూడి : ఉర్లగూడెంలో సర్టిఫికెట్లు అందచేస్తున్న ఎంపీపీ రాంబాబు నాయక్



జంగారెడ్డిగూడెం రూరల్ : శ్రీనివాసపురంలో ధ్రువీకరణ పత్రాల అందజేత



పోలవరం రూరల్ : గూటాలలో సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం



టి.నరసాపురం : బండివారిగూడెంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శ్రీనురాజు

సంఘ వ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న డీఎస్పీ ఎం.ధనుంజయుడు

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం పరిధిలో సంఘ వ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు డీఎస్పీ ఎం.ధనుంజయుడు తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ప్రధానంగా కోడిపందాలు, పేకాటలు, జూదాలు, గంజాయి వినియోగం, రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. వీటికి సంబంధించి రెండు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. స్టేషన్ పరిధిలో 200 కేసులు దర్యాప్తు దశలో ఉన్నాయని, వాటిని త్వరితగతిన దర్యాప్తు పూర్తిచేసి ఛార్జిషీటు దాఖలు చేసేలా సీఐ, ఎస్సైలకు సూచించామన్నారు. ఇదిలా ఉండగా, బుట్టాయగూడెం మండలం దొరమామిడిలో సరుగుడు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో 11 నెలల బాలుడు అదృశ్యంపై డీఎస్పీ మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం డివిజన్ నుంచి తడికలపూడి ఎస్సైతో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. కేసు మొత్తం జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి నేతృత్వంలో దర్యాప్తు జరుగుతోందని, దర్యాప్తు పూర్తయిన తరువాత అన్ని విషయాలు జిల్లా ఎస్పీ వివరిస్తారన్నారు. ఈకేసు దర్యాప్తులో 4 బృందాలు పని చేస్తున్నట్లు చెప్పారు.

ఉత్సాహంగా గడపగడపకు



కొయ్యలగూడెం : బయ్యన్నగూడెంలో బుక్‌లెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు



లింగపాలెం : భోగోలులో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

కొయ్యలగూడెం : రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించే దమ్ము ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఉంది అని వచ్చే సార్వత్రిక ఎన్నికలను అందుకు అనుకూలంగా మలుచుకొని జగన్ కేంద్ర ప్రభుత్వం చేత ప్రత్యేక హోదా ఇప్పిస్తారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. బుధవారం బయ్యనగూడెం గ్రామంలో వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు సర్పంచ్ ఎల్.అనంతలక్ష్మిల ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వచ్చే ఎన్నికలలో ఫ్యాన్ గాలి ప్రభంజనానికి చంద్రబాబు నాయుడుతో సహా తెలుగుదేశం పార్టీ కొట్టుకుపోవడం ఖాయం అన్నారు. ఈ సందర్భంగా గతంలో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమంలో ఇచ్చిన హామీల మేరకు పలుచోట్ల డ్రెయినేజీలు, సీసీ రోడ్ల ప్రారంభోత్సవానికి శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు నిర్మాణం పూర్తయిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోతన తాతారావు, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఉదయ్ కుమార్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కంభంపాటి బుజ్జిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోరుకొండ విగ్నేష్, చిక్కాల దుర్గాప్రసాద్, మట్టా సత్తిపండు, మడ్డిపాటి శ్రీను, ఉక్కుర్తి నీలయ్య, అల్లం సూరిబాబు, బాలం సూరిబాబు, పూలసరి రాంబాబు, తలారి నాగు, మద్దిపాటి లక్ష్మి, డి.కాంతారావు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

లింగపాలెం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. లింగపాలెం మండలం భోగోలు గ్రామంలో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా ఉండాలని కోరారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్లు అందించారు. సర్పంచ్ తాడేపల్లి శాంతరావు, రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ దయాల నవీన్‌బాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, ధర్మాజీగూడెం సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి వరప్రసాద్, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతరావు, ఏఎంసీ డైరెక్టర్ కె.రామకృష్ణ, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అరుణాచల యాత్రకు ప్రత్యేక సర్వీసు

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో నుంచి అరుణాచల గిరి ప్రదక్షిణ యాత్ర కోసం ప్రత్యేక సర్వీసును నడుపుతున్నట్లు జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30వ తేదీ రాత్రి 7 గంటలకు జంగారెడ్డిగూడెం నుంచి బస్సు బయలుదేరుతుందన్నారు. 31 తెల్లవారుజామున శ్రీకాళహస్తి చేసుకుని అక్కడ నుంచి కాణిపాకం, శ్రీపురం క్షేత్రాల మీదుగా రాత్రికి అరుణాచలం చేరుతుందన్నారు. ఆగస్టు 1న పౌర్ణమి దర్శన అనంతరం అరుణాచలం నుంచి బయలు దేరి 2వ తేదీ జంగారెడ్డిగూడెం చేరుకుంటుందన్నారు. ఒకరికి రూ. 2800 టిక్కెట్ ధరగా నిర్ణయించినట్లు తెలిపారు. వివరాలకు 99592 25489, 94910 19105, 73829 07490 నంబర్లను సంప్రదించాలన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు పెనుగొండకు చెందిన ఎర్రంశెట్టి శ్రీరామమూర్తి బుధవారం రూ. 1,01,116 విరాళంగా అందజేశారు. ముందుగా ఆయన కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేయగా, ఆలయ సీనియర్ అసిస్టెంట్ మద్దాల శ్రీను దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

విద్యారంగానికే అధిక ప్రాధాన్యం



కొయ్యలగూడెం : బయ్యన్నగూడెంలో జగనన్న అమ్మఒడి లబ్ధిదారులతో ఎమ్మెల్యే బాలరాజు ప్రజాప్రతినిధులు



కామవరపుకోట : రావికంపాడు జెడ్పీ హైస్కూల్‌లో అమ్మ ఒడి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

కామవరపుకోట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య రంగానికే అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. బుధవారం రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అమ్మఒడి కార్యక్రమంలో విద్యార్థుల తల్లులకు ఆయన అమ్మ ఒడి చెక్కును అందజేశారు. మండలంలో 5,718 మంది విద్యార్థులకు గాను రూ.8,57,70,000 సొమ్ము విద్యార్థుల తల్లుల ఖాతాలో జమ చేశారు. ఈ సందర్భంగా ఎలీజా మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సదుపాయాలను సద్వినియోగపరుచుకుని విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో డి.సుబ్బారావు, ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ కడిమి రమేష్, సర్పంచ్ వేముల నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు మిడతా రమేష్ బాబు, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ పండు జగదీష్, ఎంపీటీసీలు అంజిరెడ్డి, సీహెచ్ ప్రశాంత్, తమ్మిశెట్టి గిరిజ, విద్య కమిటీ చైర్మన్ వై.శ్రీనివాస్, షేక్ మేరా సాహెబ్, వందనపు సాయిబాల పద్మ, వెత్రి శ్రీను, సింహాచలం, రాంబాబు, ధనలక్ష్మి, అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : బయ్యన్నగూడెంలో అమ్మ ఒడి చెక్కును విద్యార్థుల తల్లిదండ్రులకు పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నారన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు వినియోగించుకుని విద్యార్థులు రాణించాలన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు అనర్గళంగా ఇంగ్లిసులో ప్రసంగిస్తూ జగన్ మేనమామ ప్రవేశపెట్టిన విద్యా విప్లవ వ్యవస్థ ద్వారా సాధించిన అభివృద్ధిని ఉపన్యసించడంతో ఎమ్మెల్యే వారిని అభినందించి ఆశీస్సులు అందజేశారు. అమ్మఒడి ఇన్‌ఛార్జ్ బీవీఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా అర్హులైన 7225 మంది లబ్ధిదారులకు రూ.10 కోట్ల 84 లక్షల చెక్కును అందజేశారు. హెచ్ఎం కె.రవికుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్యేని శాలువాతో సత్కరించి మెమొంటోను ప్రదానం చేశారు. రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్లభాస్కరరావు, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, ఎంపీపీ గంజిమాల రామారావు, మండల పరిషత్తు ఉపాధ్యక్షులు తుమ్మలపల్లి గంగరాజు, మట్ట వనజాలక్ష్మి, సర్పంచ్ లింగిశెట్టి అనంతలక్ష్మి, ఉపసర్పంచ్ కోరుకొండ లలిత తదితరులు పాల్గొన్నారు.

9న గంగానమ్మకు బోనాలు

జంగారెడ్డిగూడెం : ఈ నెల 9వ తేదీన పట్టణ గంగానమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఆదివారం ఉదయం 9 గంటలకు అశ్వారావుపేట రోడ్డులో హైస్కూల్ వద్ద గల శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం నుంచి బోనాలు బయలు దేరి గంగానమ్మ అమ్మవారికి సమర్పించనున్నట్లు తెలిపారు. బోనాలు తెచ్చేవారు కొత్త కుండ, బియ్యం, ఆవుపాలు, బెల్లంతో చేసిన పొంగలి, అలాగే బోనాలను వేపాకులు, పూలతో అలంకరించి తీసుకురావాలని కోరారు.

నలుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

ద్వారకాతిరుమల: ఒక వ్యక్తిని కులం పేరుతో దూషించారని వచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురు వ్యక్తులపై బుధవారం ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ దుర్గారావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం. మండలంలోని కొమ్మర గ్రామంలోని కొత్తకర్ర చెరువులో ఈనెల 2వ తేదిన మట్టితవ్వకాలు జరుగుతున్నాయని, ఆ పనులను తాను అడ్డుకున్నట్టు గ్రామ పంచాయతీ 9వ వార్డు సభ్యుడు మానుకొండ పూర్ణ రామకృష్ణ ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఆ సమయంలో తనపై దాడి చేసి, కులం పేరుతో దూషించిన అదే గ్రామానికి చెందిన ఆత్మకూరి ప్రసాద్, ఆత్మకూరి శ్రీనివాసరావు, ఆత్మకూరి పుల్లయ్య, ఈడ్పుగంటి శ్రీను అను వారిపై చర్యలు తీసుకోవాలని ద్వారకాతిరుమల పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు.

నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు

కుక్కునూరు : మండలంలో శిథిలావస్థకు చేరుకున్న విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. బుధవారం నూతన విద్యుత్ స్తంభాలకు విద్యుత్ తీగలను ఏర్పాటు చేసి సిబ్బంది విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. కాగా బుధవారం సాయంత్రం గాంధీనగర్ సమీపంలో విద్యుత్ తీగ తెగిపడింది. దీంతో స్థానికులు వెంటనే లైన్ ఇన్‌స్పెక్టర్ బీఎన్ఎల్ శ్రీనివాస్‌కు సమచారాన్ని అందించడంతో ఆయన వెంటనే విద్యుత్ పరఫరా నిలిపివేసి మరమ్మతులు నిర్వహించి విద్యుత్ సరఫరాను కొనసాగించారు.